క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మామిడికుదురు: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డీఎల్‌పీఓ బొజ్జిరాజు సూచించారు. మామిడికుదురు, పాశర్లపూడి, నగరం, పెదపట్నం, మొగలికుదురు, గెద్దాడ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను డీఎల్‌పీఓ మంగళవారం పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి దాన్ని సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. డ్రైడే ఫ్రైడేతో పాటు ప్రతి రోజు పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



ప్రసాద్‌కు సాయం అందిస్తున్న రాంబాబు రాజు

మలికిపురం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మోరి గ్రామానికి చెందిన రాచపల్లి దుర్గ ప్రసాద్‌కు చికిత్స నిమిత్తం మలికిపురానికి చెందిన దెంతుకూరి రాంబాబురాజు రూ.25 వేల ఆర్థికసాయం చేశారు. మలికిపురంలో తన కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు సాయం అందించారు. దాత రాంబాబు రాజును పలువురు అభినందించారు.

పళ్లాలమ్మ జాతర విజయవంతంగా నిర్వహించాలి

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దేవస్థానం అధికారులకు, గ్రామ పెద్దలకు సూచించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జాతర, తీర్థ మహోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను వాడపాలెంలో ఎమ్మెల్యే సత్యానందరావు ఆవిష్కరించారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి జాతర, తీర్థ మహోత్సవాల గురించి వివరించారు. కార్యక్రమంలో వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, దేవస్థానం మాజీ చైర్మన్ మద్దింశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

18న ఆదుర్రులో బౌద్ధ ఉత్సవాలు

మామిడికుదురు: బుద్ధ పూర్ణిమ సందర్భంగా ఈ నెల 18న ఆదుర్రు ఆది బౌద్ధ స్థూపం వద్ద ప్రాచీన భారతీయ వారసత్వ సాంస్కృతిక బౌద్ధ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు బుద్ధ విహార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్‌ఎస్‌ఆర్ భూపతి తెలిపారు. ఉత్సవ కరపత్రాలను బౌద్ధ స్థూపం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, బుద్ధ విహార్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పి.గన్నవరం: స్థానిక మూడు రోడ్ల సెంటర్ వద్ద కెనాల్ రోడ్‌లో ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. వార్ఫ్ నుంచి రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న వంతెన వరకూ 45 మంది చిరు వ్యాపారులు వివిధ రకాల షాపులు నిర్వహిస్తున్నారు. ఆర్‌పీ రోడ్డు, పంట కాలువ వైపు కాంక్రీటు రక్షణ గోడ నిర్మాణం వంటి ఆధునీకరణ పనుల కోసం ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్ 15 రోజుల క్రితం ఆక్రమణ దారులకు చెప్పారు. గడువు పూర్తి కావడంతో మంగళవారం నుంచి ఆక్రమణ తొలగింపు పనులు ప్రారంభించారు. కొందరు తమ షాపులను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ఇటుకలతో కట్టిన నిర్మాణాలను అధికారులు జేసీబీ ద్వారా తొలగిస్తున్నారు. గత 40 ఏళ్లుగా తాము ఇక్కడ వ్యాపారాలు నిర్వహించుకుంటున్నామని, తమ షాపులను తొలగించడం వల్ల జీవనాధారం కోల్పోయామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెగా జాబ్ మేళాతో మేలు

రాజోలు: మెగా జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ అన్నారు. మంగళవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా వికాస, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏ1 సేవా సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎంపీ హరీష్ మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు ప్రారంభించారు. మెగా జాబ్‌మేళాలో 423 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ

రావులపాలెం: మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలను మంగళవారం డీఈవో సలీం బాషా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూడైస్ ప్లస్ కార్యక్రమాన్ని అందరు విద్యార్థులకు చేయాలని, అపార్ ఐడీ అందరూ విద్యార్థులకు క్రియేట్ చేయాలని, ప్రతీ ప్రైవేట్ పాఠశాల సీఎస్‌ఈ లాగిన్‌లో ఫారమ్-1 పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

ప్రయాణం సురక్షితమేనా?

- వంతెన నాణ్యత పరిశీలన
- అనుమానంతో అప్రమత్తమైన మోర్త్
- ప్రత్యేక కన్సల్టెన్సీకి కాంట్రాక్ట్



దిండి-చించినాడ వంతెనపై నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న మొబైల్ బ్రిడ్జ్ క్వాలిటీ వాహనం



వంతెనపై జాయింట్ల వద్ద శిథిలమైన రోడ్డు

మలికిపురం: ఇది కోస్తా తీరంలోని ప్రధాన జాతీయ రహదారి అయిన 216. దీనిపై వశిష్ట గోదావరి నదిపై సుమారు 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన దిండి-చించినాడ వంతెన. ఇది నిర్మాణం ప్రారంభించి 30 ఏళ్లు పైబడింది. కానీ నిధుల లేక చతికిలపడి ఎట్టకేలకు 2001లో పూర్తయింది. దీనిపై ఎందుకు వచ్చిందో మరి అనుమానం. ఉన్నట్టుండి ఈ వంతెన నాణ్యత ఎలా ఉందోననే పరిశీలన చేపట్టింది. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అఫ్ హైవే (మోర్త్) అధికారులు హైదరాబాద్‌కు చెందిన లేస్ లాజిస్టిక్ సంస్థకు కాంట్రాక్ట్‌కు ఇచ్చి మొబైల్ బ్రిడ్జ్ క్వాలిటీ వాహనంతో వంతెన నాణ్యత పనులను గత రెండు రోజులుగా పరిశీలిస్తున్నారు. ఫైనల్ రిపోర్టు వారంలో వచ్చే అవకాశం ఉంది. సుమారు ఏడు పిల్లర్లు గల ఈ వంతెన ప్రారంభ సమయంలో చించినాడ వైపు నుంచి నదిలో మూడో పిల్లర్ అప్పట్లో వరదలకు కూలిపోయింది. దీంతో కొంత కాలం పనులు ఆపేశారు. పైగా అప్పట్లో నిధులు కూడా కొరత ఉండేది. జీఎంసీ బాలయోగి లోక్ స్పీకర్ అయ్యాక ఈ రహదారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంతెన పనులు పూర్తి చేయించారు. తొలుత వంతెన జాయింట్లలో రబ్బరు మెటీరియల్ ఉంచారు. వంతెన నిర్మాణం పూర్తయిన ఏడాదిలోనే రబ్బరు మెటీరియల్ పాడయిపోయింది. అక్కడ జాయింట్లు కూడా పగిలిపోయాయి. తరువాత మరమ్మతులు చేశారు. ఇలా ప్రతి ఏటా జాయింట్లలో పగిలి పోవడం అధికారులు మరమ్మతులు చేయడం జరుగుతుంది. అయితే ఈ ఏడాది ఏకంగా రెండు సార్లు పగిలిపోవడంతో మోర్త్ అప్రమత్తం అయింది. పైగా వంతెన కూడా స్వింగ్ అధికంగా ఉంటుంది. ఈ సారి నాణ్యత పరిశీలనకు ప్రాధాన్యం ఇచ్చింది. మరమ్మతుల్లో లోపమా లేక వంతెన అధికంగా స్వింగ్ కావడం వల్ల జరుగుతుందా అనేది తేలాల్సి ఉంది.

పెరిగిన రద్దీ

గడచిన పదేళ్లుగా నిమిషానికి అరవై నుంచి డబ్బై వాహనాలు రాకపోకలు సాగించే రహదారి ఇది. జాతీయ రహదారిగా మారడం, చాలా చోట్ల నాలుగు లేనోళ్ల పనులు పూర్తి కావడంతో ఈ రహదారిలో వాహనాల తాకిడి తీవ్రమైంది. చెన్నై నుంచి విశాఖపట్నం, కోల్‌కతా రాకపోకలు సాగించే వాహనాలు కూడా ఒంగోలులో ఎన్‌హెచ్ 16ను వీడి 216 జాతీయ రహదారి ద్వారా కోనసీమ జిల్లా ద్వారానే రాకపోకలు సాగించడం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో ఇక్కడ వంతెన మాత్రం రెండు లేన్లు ఉండడం వల్ల భారీ వాహనాల భారం అధికంగా పడిందనే వాదన ఉంది. ఐదేళ్ల క్రితం ఈ రహదారిలోని యానం వంతెన, మురమళ్ల వంతెన, పాశర్లపూడి వంతెన నాణ్యత పరిశీలించి తగిన విధంగా మరమ్మతులు చేశారు. అయితే దిండి-చించినాడ వంతెన మాత్రం అభివృద్ధి చేయలేదు. ఈ వంతెన తరువాతే అవి నిర్మాణమయ్యాయి.

పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలి



దిండి- చించినాడ వంతెనపై తరచూ రోడ్డు ధ్వంసం అవుతుంది. మరమ్మతులు కూడా సక్రమంగా చేయరు. నాణ్యత లోపమా లేక వంతెన బలహీనమా తేలాలి. అధికారులు తగినవిధంగా స్పందించి చర్యలు తీసుకోవాలి. వంతెనపై నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తారు. దీనికి నాలుగు లేన్ల రోడ్డుకు అనుగుణంగా సమాంతరంగా రెండో వంతెన నిర్మాణం చేయాలి.

– కోటిపల్లి ఎస్తేరు రాణి, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, తాటిపాక

జగ్గిరెడ్డిని కలసిన విద్యార్థి విభాగం నాయకులు



జగ్గిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న విద్యార్థి విభాగం నాయకులు

రావులపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలపురంలోని జగ్గిరెడ్డి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, రమేష్ జిల్లెల్ల, గొల్లపల్లి రాజశేఖర్, గంటి ఆకాష్, అబ్బిరెడ్డి వీర్రాజు, దొమ్మేటి అర్జున్, కరుణ సాయి తదితరులు కలసి దుశ్శాలువ, పూలమాలలతో జగ్గిరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓగా సరోవర్

అయినవిల్లి: మండల ఎంపీడీఓగా వెంకట సరోవర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన గిడ్ల భీమారావు అంబాజీపేట బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓ వెంకట సరోవర్‌ను వివిధ పార్టీనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ ధర్నా



లక్కవరంలో ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులతో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: లక్కవరం, పోతుమట్ల రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ గ్రామ ప్రజలతో కలిసి వైఎస్సార్ సీపీ మంగళవారం ధర్నా నిర్వహించింది. ధర్నాలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ చింతలపల్లి కళింగల నుంచి లక్కవరం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం మూడు నెలల క్రితం స్థానిక కూటమి ఎమ్మెల్యే హంగు ఆర్భాటంతో శంకుస్థాపన చేశారని. తరువాత రోడ్డు ఒక పక్కన నాలుగు అడుగుల లోతు మూడు మీటర్ల వెడల్పులో మట్టిని తీసి పట్టుకుపోయి మరలా ఇప్పుడు దానిని అరకొరగా పూడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇలా చేయడం సరికాదని, తవ్విన మట్టిని అమ్ముకుని అక్కడ ఉన్న దానితో పైపైన పూడ్చడం వల్ల బస్సులు, భారీ వాహనాలు వాటిలోకి దిగిపోయి ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని, నాలుగు మండలాలను కలుపుకుని పోయే ఈ రోడ్డును వెంటనే గ్రావెల్‌తో మరమ్మతులు చేసి పటిష్టంగా రోడ్డు వేయాలని కోరారు. నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మలికిపురం పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు దొమ్మేటి సత్యమోహన్, తాడి సహదేవ్, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు గుర్రం జాషువా, ఎస్తేరు రాణి, కొల్లాబత్తుల సతీష్, జిల్లెల్ల ఉదయ్ కిరణ్, నామన మణికంఠ, ఉచ్చుల దాసు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



గంగలకుర్రులో తడిసిన ధాన్యం పనలను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొగలికుదురులో తడిసిన ధాన్యం రాశులను మంగళవారం వైఎస్సార్ సీపీ బృందం పరిశీలించింది. తడిసిన ధాన్యాన్ని తక్షణం మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టార్గెట్లు అయిపోయాయని అధికారులు ధాన్యం కొనడం లేదని రైతులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గోనిపాటి రాజబాబు, గుబ్బల శ్రీను వాపోయారు. గతంలో ఈ పరిస్థితి లేదన్నారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కడి శ్రీను, కొప్పిశెట్టి హేమసుందర్, తోరం భాస్కర్, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, మట్టపర్తి శివ, నెల్లి దుర్గాప్రసాద్, కొల్లాబత్తుల మధువాసన్ పాల్గొన్నారు.

అంబాజీపేట/అయినవిల్లి/పి.గన్నవరం: ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు రైతులు విక్రయించుకునేందుకు వీలు లేకుండా కూటమి ప్రభుత్వం కటింగ్ పెట్టడం సిగ్గుచేటని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు విమర్శించారు. రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, వరి రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంగలకుర్రు పెదగరువు వద్ద ఉన్న ఆరబెట్టిన ధాన్యాన్ని, వర్షాలకు తడిసిన వరి పనలను పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు పార్టీ నాయకులతో కలసి మంగళవారం పరిశీలించారు. రైతులు పితాని శ్రీనివాస్, విత్తనాల బాలరాజు, ఇళ్ల గోపిలు మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ధాన్యంను కొనుగోలు చేసేందుకు పరిమితి అయిపోయిందని తాము కొనుగోలు చేయలేమని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిల్లర్లు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయకుండా పరిమితి అయిపోయిందని చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని, తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ డి.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బి.వరలక్ష్మి, సర్పంచ్ కె.శ్రీనివాసరావు, డి.సత్యమోహన్, ఎం.కిరన్‌కుమార్, పేరి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరం మండలం రాజులపాలెం, అయినవిల్లి మండలం సిరిపల్లిల్లోనూ మండల నాయకులతో కలసి కోఆర్డినేటర్ తడిసిన పనలను పరిశీలించారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



ఉపాధి పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దేవ తదితరులు

సఖినేటిపల్లి/మలికిపురం: గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ-ఆంధ్రప్రదేశ్ ఆదిత్రి ప్రోగ్రాం ద్వారా మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని ఎంపికైన 33 గ్రూపులకు రూ.68 లక్షల విలువైన ఉపాధి యంత్రాలు అందజేశారు. మోరి వీ కన్వెన్షన్ మాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏపీఎస్‌ఆర్‌ఎం అదిత్రీ సేవలను ప్రశంసించారు. మహిళల కోసం ఉపాధి శిక్షణ కార్యక్రమాలకు తాము సంపూర్ణ సహకారం అందిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు రాజోలు నియోజకవర్గంలో 10 లేస్ బిల్డింగులు ఉన్నాయని వాటిని ఉపాధి శిక్షణ కోసం వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లను యూనివర్సిటీ యాజమాన్యం సత్కరించి జ్ఞాపికలను ప్రదానం చేసింది. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు డాక్టర్ సిద్ధార్థ త్రిపాఠి అనూప్ సింగ్ సూర్యవంశీ, ఉదయన్ భక్షితో పాటు ఆదిత్రి సభ్యులు పాల్గొన్నారు. వేదికపై సంస్థ ద్వారా ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను అందించారు.

75 శాతం పుస్తకాల సరఫరా



లూటుకుర్రులోని స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలకు ఇంత వరకు 75 శాతం నోటు పుస్తకాల సరఫరా చేశామని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను మంగళవారం పరిశీలించారు. సుబ్రహ్మణ్యం టీమ్ సభ్యులతో మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా బొమ్మూరు కేంద్రం నుంచి టెస్టు పుస్తకాలతో పాటు వర్క్ బుక్స్‌ను కూడా సరఫరా చేశామన్నారు. మిగిలిన 25 శాతం పుస్తకాలను కూడా త్వరలోనే సరఫరా చేస్తామన్నారు. ఈ ఏడాది ఆరో తరగతికి 40 రోజుల సంసిద్ధత కార్యక్రమం అమలు చేస్తామని చెప్పారు. దానికి రెండు ప్రత్యేక పుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఒకటి గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం కలిపి మరొకటి అన్ని మండలాలకు అందించామన్నారు. 36 టైటిల్స్‌లో ఒకటి నుంచి పదో తరగతి వరకు నోటు పుస్తకాలు సరఫరా చేశామని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన వెంట ఎంఈఓలు ఎస్. లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు, సీఆర్పీలు, పీటీఐలు, ఏఈఆర్పీలు, సిబ్బంది ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

అలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీలకు చెందిన ఆరోగ్య సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ క్లినిక్)లో మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు ఇటీవల నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు హేళనగా మాట్లాడారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. గ్రామాల్లో సుదీర్ఘకాలంగా అనేక కష్టనష్టాలను అనుభవిస్తూ సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందిపై సీహెచ్‌ఓలు చేసిన వ్యాఖ్యలు వైద్యారోగ్యశాఖను అవమానించడమేనన్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్‌ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, అర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న కల్యాణం

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్వామి వారి తీర్థం నిర్వహించనున్నామన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చి వెంకన్న ఆశీర్వాదాలు స్వీకరించాలన్నారు.

15 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో 15 లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన ఐనం రాము వద్ద 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం కొత్తపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మాజీ ఎమ్మెల్యే రాజా పరామర్శ

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము చిన్న కుమారుడు కొమ్ముల రమేష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్నారు. రమేష్‌ను రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంగళవారం పరామర్శించారు. అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాముకు ధైర్యం చెప్పారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: కిశోర బాలిక వికాస శిబిరాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ మహాలక్ష్మి అధ్యక్షతన కిశోర బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ బాలికలు విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళా పోలీస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ఆలమూరు: గ్రామీణ ప్రాంత ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీభాను తేజస్ మల్టీ స్పెషాలిటీస్ హాస్పిటల్, రేవతి హాస్పిటల్, డాక్టర్ మోహన్ డయాబెటిక్ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగుల వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయా ఆస్పత్రులకు చెందిన వైద్యులు పాల్గొని 152 మంది ఉద్యోగులకు రక్త, నేత్ర, దంత పరీక్షలను ఉచితంగా నిర్వహించి వైద్యసేవలు అందించారు.

పేదలకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. ఈ సాయాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి శాంతి చేతుల మీదుగా ఇచ్చారు. ఈ నెలకు సేవా కార్యక్రమాలకు గాను ట్రస్టుకు విరాళంగా రూ.20 వేలు దుబాయ్ ఎన్నారై లు నిర్మల, డేవిడ్‌పాల్ దంపతులు అందజేశారన్నారు.

మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సఖినేటిపల్లి: ఎన్‌ఆర్‌జీఎస్ పథకంలో గ్రామాల్లో చేపట్టే పనులు వద్ద కూలీలకు వేసవి మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మోరిపోడులో ఉపాధి కూలీలు, మేట్స్ సంయుక్తంగా ప్రదర్శన చేశారు. ఉపాధి కూలీల సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు ఈ ప్రదర్శన నిర్వహించారు. పథకంలో అనేక మార్పులు తేవడం వల్ల మేట్స్‌కు అదనపు బాధ్యతలు ఏర్పడినట్టు ఆయన అన్నారు. మేట్స్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భీమారావు సేవలు అమూల్యం

అయినవిల్లి: మండల ఎంపీడీఓగా గిడ్ల భీమారావు అందించిన సేవలు అమూల్యమైనవని, ఆయన ఎంపీడీఓగా పనిచేసిన కొంత కాలంలో ప్రజల నుంచి రాజకీయ నాయకుల నుంచి మంచి పేరు తెచ్చుకున్నారని పలువురు పార్టీ నాయకులు అభివర్ణించారు. మంగళవారం అంబాజీపేట బదిలీపై వెళ్లుతున్న ఎంపీడీఓ జి.భీమారావుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు వీడ్కోలు సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఎంపీడీఓ భీమారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, రాజుబాబు, పంచాయతీ కార్యదర్శులు కె. రామచంద్రరావు, రెమళ్ల సూర్యనారాయణమూర్తి, వెంకన్న, రవి తదితరులు ఉన్నారు.

నయనానందకరం గండర దీపోత్సవం

అయినవిల్లి: కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మకు మంగళవారం తీర్థమహోత్సవాలు నిర్వహించారు. ఆర్ల అక్కమ్మకు పెద్ద ఎత్తున భక్తులు గండర దీపాలు సమర్పించారు. ఈ దీపాలను పళ్లెంలో ఉంచి భక్తులు శిరస్సున ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగారు. గండర దీపాలతో భక్తులు రెండు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. ఈ సుందర దృశ్యాల్ని చూడడానికి భక్తులు ఎగబడ్డారు. మొక్కుల రూపంలో అమ్మవారికి గండర దీపాలు, దండుగమ్మ కావళ్లు సమర్పించారు. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అలాగే నేదునూరులో ముత్యాలమ్మవారి తీర్థం ఘనంగా జరిపారు.

దేవాలయ భూముల పరిశీలన



కేశవదాసుపాలెంలో దేవస్థానం భూముల వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్న ఆర్డీఓ మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం, నీలకంఠేశ్వరస్వామివారి ఆలయానికి సంబంధించిన భూముల వాస్తవ పరిస్థితులపై సర్వే నిమిత్తం ఆయా శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన టీమ్‌ల పనితీరు పరిశీలనకై మంగళవారం అమలాపురం ఆర్డీఓ కొత్త మాధవి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా ఆర్డీఓ కేశవదాసుపాలెంలోని దేవస్థానం భూములను సందర్శించారు. భూముల ప్రస్తుత స్వభావం, అందులో పంటలు, చెరువులు సేద్యం, నిర్మాణాలు తదితర అంశాలపై రెవెన్యూ, అగ్రికల్చర్, ఫిషరీస్ సిబ్బంది సేకరిస్తున్న విధానాలను ఆర్డీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఆర్డీఓ చేశారు. వెంట ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, డీటీ సీహెచ్ భాస్కర్, ఫిషరీస్, అగ్రికల్చర్ అధికారులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కార్యదర్శిపై బీజేపీ నేత ఆరోపణలు

రావులపాలెం: గ్రామ పంచాయతీకి సంబంధించి సమస్యలపై ఫిర్యాదు చేసినా పూర్తి స్థాయిలో పరిష్కరించకుండా చర్యలు తీసుకున్నట్టు చూపించారని బీజేపీ రాష్ట్ర పదాధికారి తమనంపూడి రామకృష్ణారెడ్డి రావులపాలెం పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్‌పై ఆర్డీవో గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఆరోపణలపై ఈఓపీఆర్‌డీ, డిప్యూటీ ఎంపీడీవో కృష్ణను వివరణ కోరగా స్వచ్ఛ భారత్‌కు సంబంధించి ఎటువంటి నిధులు పంచాయితీకి రాలేదన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం ముశినివారిపాలెం హనుమాన్ జంక్షన్‌లో వేంచేసిన హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు.

నేటి నుంచి అమ్మవార్ల జాతర

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో కొలువై ఉన్న బలుసులమ్మ, కాళికాదేవి, కనకదుర్గ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు మంగళవారం ఉత్సవ కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో భాగంగా 7న అమ్మవార్ల జాత, 8న అశ్వవాహనంపై గ్రామోత్సవం, 9న రథోత్సవం, 10న నైవేద్యాలు, అమ్మవార్లకు చలిమిడి పానకాల నివేదన, తీర్థం నిర్వహిస్తున్నట్టు కమిటీ వెల్లడించింది. 11న భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపింది. అలాగే గొంది గ్రామంలో కొలువైన కనక ముత్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ పేర్కొంది.

8న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి వారి కల్యాణం

సఖినేటిపల్లి: మండలంలో కొలువైన పార్వతీ భీమేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం ఈ నెల 8న నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఉత్సవ కమిటీ, రుద్రరాజు రామలింగరాజు ఫ్యామిలీ ట్రస్టు మంగళవారం తెలిపింది. శైవాగమ పండితుడు బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథ శర్మ బ్రహ్మత్వంలో అర్చకులు పర్యవేక్షణలో గ్రామానికి చెందిన రుద్రరాజు రఘురామ కృష్ణంరాజు, శ్రీదేవి దంపతులతో కల్యాణం నిర్వహించనున్నట్టు కమిటీ వెల్లడించింది. కాగా అదే రోజు రాత్రి అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కూడా ఆలయ కమిటీ తెలిపింది.